
ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 28.5
కనిష్ఠం 23.0
**



సూర్యాపేట

5


ఆదివారం 22 సెప్టెంబరు 2024

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	589.80 (311.4474)	7,699	44,943
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.90 (4.17)	1,825	435.94
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	174.89 (45.61)	29,845	33,640

చికెన్ ధరలు | లైవ్ : రూ.120 | డ్రెస్ : రూ.190 | స్కిన్‌లెస్ : రూ.210

చాకలిగట్టుకు మహర్దశ



నాగార్జునసాగర్, సెప్టెంబరు 21 : ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్‌లో మరో పర్యాటక కేంద్రం అందుబాటులోకి రానుంది. సాగర్ ప్రాజెక్ట్ నిర్మాణ సమయంలో తవ్వకాల్లో బయల్పడిన బౌద్ధ మత నమూనాలను సాగర్ జలాశయం మధ్యలోని నాగార్జునకొండలో 1966లో పురావస్తు శాఖ మ్యూజియం నిర్మించి భద్రపరిచింది. దీంతో ఈ మ్యూజియాన్ని తిలకించేందుకు ప్రతీ ఏటా దేశ, విదేశాల నుంచి పర్యాటకులు సాగర్‌కు వస్తుంటారు. లాంచీలో వెళ్లి మ్యూజియంను తిలకించడంతో పాటు ఇక్కడ ఆనందంగా గడుపుతారు. ప్రస్తుతం దానిపక్కనే 1.5 కిలోమీటరు దూరంలో చాకలిగట్టు అనే అటవీ శాఖ జింకల పెంపక కేంద్రం ఉంది. ఈ గట్టును ఎకో టూరిజం కేంద్రంగా మార్చాలని రాష్ట్ర పర్యాటక శాఖ యోచిస్తోంది. దీంతో చాకలిగట్టుకు మహర్దశ పట్టనుందని భావిస్తున్నారు. రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలను పర్యాటక శాఖ మరింతగా అభివృద్ధి చేసి ఆదాయాన్ని సమకూర్చాలని భావిస్తోంది. దీంతో గత నెలలో రాష్ట్ర పర్యాటక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఎండీలు సాగర్‌ను సందర్శించి చాకలిగట్టును పరిశీలించారు. చాకలిగట్టును ఎకో టూరిజం కేంద్రంగా ఏర్పాటుచేస్తే రాష్ట్ర పర్యాటక శాఖకు మరింత ఆదాయం సమకూరుతుందని పర్యాటక శాఖ ఉన్నతాధికారులు నివేదికలు తయారు చేసి మంత్రి జూపల్లి కృష్ణారావుకు అందజేశారు. దీంతో మంత్రి సానుకూలంగా స్పందించి చాకలిగట్టును ఎకో టూరిజం కేంద్రంగా చేయాలని నిర్ణయించారు.

రెండు పర్యాయాలు అధికారుల సర్వే

రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో ఇప్పటికే నెల రోజుల వ్యవధిలో పురావస్తు శాఖ విభాగానికి చెందిన ఉన్నతాధికారులతో పాటు రెవెన్యూ, అటవీ శాఖ అధికారులతో కలిసి సర్వేలు చేశారు. మౌలిక వసతుల కల్పనపై చర్చించారు. మొదటగా రూ.100 కోట్లతో చాకలిగట్టుపై కాటేజీలు, విద్యుత్ సౌకర్యం, తాగు నీటి సౌకర్యం, వంటి మౌలిక వసతులతో పాటు పర్యాటకులు రాత్రి వేళల్లోనూ అక్కడ బస చేసేలా టెంట్ కాటేజీలను కూడా ఏర్పాటుచేయాలని రాష్ట్రపర్యాటక శాఖ నిర్ణయించినట్లు సమాచారం.

- 407 ఎకరాల విస్తీర్ణం
- నాగార్జున సాగర్ జలాశయంలో మరో పర్యాటక ప్రాంతం
- కృష్ణమ్మ ఒడిలో అద్భుత ద్వీపం చాకలిగట్టు
- పర్యాటక కేంద్రంగా మార్చే ఆలోచనలో ప్రభుత్వం

ప్రకృతి రమణీయం..

నల్లటి దట్టమైన నల్లమల అటవీ ప్రాంతంలో పక్షుల కిలకిలలతో, కృష్ణమ్మ జలసవ్వడితో ప్రకృతి ప్రేమికులను ఎంతగానో ఆకట్టుకునే అద్భుతమైన పర్యాటకప్రాంతాలు అంతర్జాతీయ పర్యాటక ప్రాంత మైన నాగార్జునసాగర్‌లో ఉన్నాయి. సాగర్ హిల్‌కాలనీ డౌన్ పార్క్ వద్ద ఉన్న తెలంగాణ లాంచీ స్టేషన్ నుంచి జలాశయం మధ్యలో ఏపీ అటవీ ప్రాంతంలోని నాగార్జునకొండకు వెళ్లే మార్గంలో హిల్‌కాలనీ లాంచీ స్టేషన్ నుంచి 15 కిలోమీటర్ల దూరంలో నాగార్జునకొండ ఉంటుంది. అక్కడి నుంచి కేవలం 1.5 కిలోమీటర్ల దూరంలో 407 ఎకరాల్లో చాకలిగట్టు విస్తరించి ఉంది. అటవీశాఖ ఆధ్వర్యంలో జింకల పెంపక కేంద్రంగా ప్రస్తుతం పేరొందింది. విశాలంగా చుట్టూ నీటితో ద్వీపకల్పంగా ఉండే చాకలిగట్టు ప్రకృతి రమణీయతకు నిలయంగా ఉంటుంది. అద్భుతమైన ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దితే మరింత శోభ వచ్చే అవకాశం ఉంటుంది. అదేవిధంగా సాగర్‌లో మరో పర్యాటక ప్రాంతంగా వెలుగొందనుంది.



లోక్‌అదాలత్ సభ్యుల నియామకం

హుజూర్‌నగర్ రూరల్, సెప్టెంబరు 21: పట్టణంలోని పలు కోర్టులకు సంబంధించి ఈ నెల 28న నిర్వహించనున్న జాతీయ మెగా లోక్‌అదాలత్‌కు సభ్యులను నియమిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి గోవర్ధన్‌రెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా అదనపు కోర్టు ప్రిసైడింగ్ అధికారిగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి గోవర్ధన్‌రెడ్డి, కమిటీ సభ్యులుగా కాలువ శ్రీనివాస్‌రావు, షేక్ సైదాహుస్సేన్, సీనియర్ సివిల్ జడ్జికోర్టుకు ప్రిసైడింగ్ అధికారిగా సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యామ్‌కుమార్, సభ్యులుగా కుక్కడపు బాలకృష్ణ, కమతం నాగార్జున, జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు ప్రిసైడింగ్ అధికారిగా జూనియర్ సివిల్ జడ్జి మారుతి ప్రసాద్, సభ్యులుగా చల్లా కృష్ణయ్య పాలేటి శ్రీనివాసరావులను నియమిస్తూ జిల్లా ప్రధానన్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేసినట్లు న్యాయవాదులు తెలిపారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

డీఎంహెచ్‌వో కోటాచలం



రిజస్టర్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో కోటచలం

తిరుమలగిరి, సెప్టెంబరు 21: వైద్యశాఖలో పని చేసే ఉద్యోగులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని డీఎంహెచ్‌వో కోటాచలం హెచ్చరించారు. శనివారం తిరుమలగిరి ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు రిజిస్టార్‌ను పరిశీలించారు. విధులకు హాజరుకాని ఇద్దరు ఉద్యోగులకు షోకాజు నోటీసులు జారీచేశారు. సమయపాలన ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు. ఆస్పత్రికి వచ్చిన గర్భిణులు, బాలింతలతో మాట్లాడి వైద్యసేవల తీరును తెలుసుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ మల్లెల వందన ఉన్నారు.

కొండా లక్ష్మణ్‌బాపూజీ ఆశయాలు సాధించాలి



లక్ష్మణ్‌బాపూజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీసీ సంఘ నాయకులు

సూర్యాపేటటౌన్, సెప్టెంబర్ 21: కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను సాధించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చలమల్ల నర్సింహ అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని జ్యోతిరావ్‌పూలే విగ్రహం వద్ద కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. 1938 వందేమాతరం ఉద్యమం మొదలుకొని తెలంగాణ ఉద్యమం వరకు ఆయన సాగించిన ప్రజాప్రస్థానం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. పలుమార్లు శాసన సభ్యుడిగా ఎన్నికై నిబద్ధత కలిగిన రాజకీయవేత్తగా ప్రజల మన్ననలు పొందారన్నారు. కార్యక్రమంలో నాయకులు పెండెం కృష్ణ, దూలం నగేష్, యలగందుల సుదర్శన్, మిట్టకోల యుగేందర్, పున్న వెంకన్న, బల్నె కాంత్రి, తన్నీరు వాసుదేవ్, రాచకొండ ధనలక్ష్మి, రాపోలు ఉపేందర్, యలగందుల వెంకటేశ్వర్లు, పాపని యాదగిరి, చంద్రమౌళి పాల్గొన్నారు.

బీసీ మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్ కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న లలితాదేవి

సూర్యాపేటటౌన్, సెప్టెంబరు 21: చట్టసభల్లో బీసీ మహిళలకు రాజకీయ రిజర్వేషన్ కల్పించాలని ప్రముఖ కవి, రచయిత దాసోజు లలిత, ప్రముఖ న్యాయవాది గాయత్రి అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో మహిళా రాజకీయ రిజర్వేషన్, బీసీ మహిళా కోటా పై నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం గత ఏడాది తీసుకొచ్చిన మహిళా రిజర్వేషన్ చట్టంలో బీసీలకు కోటా ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. బీసీ మహిళలకు చట్టసభల్లో రాజకీయ రిజర్వేషన్ లభించే వరకూ ఉద్యమం ఆగదన్నారు. జాతీయ, రాష్ట్రస్థాయిలో బీసీ మహిళా కమిషన్ ఏర్పాటు చేయాలని, బీసీ కులగణన చేపట్టి స్థానిక ఎన్నికల్లో 50శాతం బీసీ రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో వనిత, లక్ష్మీదేవి, ఉపేంద్రబాయి, సృజన, దుర్గారాణి, విజయ, విప్లవ, త్రివేణి, జానకి పాల్గొన్నారు.

కమనీయం లక్ష్మీనరసింహుని కల్యాణం

కల్యాణతంతు నిర్వహిస్తున్న వేదపండితులు



మఠంపల్లి, సెప్టెంబరు 21: మట్టపల్లి లక్ష్మీనృసింహుని క్షేత్రంలో శనివారం శ్రీరాజ్యలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత లక్ష్మీనరసింహుడి నిత్యకల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి నిజాభిషేకం, నిత్యార్చనలు చేశారు. అనంతరం ఆలయ సంప్రదాయ ప్రకారం ఆర్జిత కైంకర్యాలు నిర్వహించారు. కల్యాణమూర్తులను పరిణయ వేదికపై అధిష్ఠింపజేసి పుణ్యాహవాచనం చేశారు. మాంగళ్యధారణ అనంతరం దివ్యమూర్తులకు గరుడోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం అమ్మవారికి కుంకుమార్చన, విశేషపర్వాలు కొనసాగాయి. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చెన్నూరి విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో సిరికొండ నవీన్, ఆలయ అర్చకులు, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాయం కోసం ఎదురు చూపులు



- నష్టం జరిగి 20 రోజులు కావస్తున్నా ఒక్కపైసా రాలే...
- హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల్లో భారీ నష్టం
- దిక్కుతోచని స్థితిలో రైతాంగం

హుజూర్‌నగర్, సెప్టెంబరు 21 : ఇటీవల కురిసిన భారీ వర్షం హుజూర్‌నగర్, కోదాడ నియోజవర్గాల్లో పెద్ద నష్టాన్ని మిగిల్చింది. పలు ప్రాంతాల్లో బ్రిడ్జిలు కొట్టుకుపోయాయి. కాల్వలు, చెరువులకు గండ్లు పడ్డాయి. గ్రామీణ రోడ్లు అస్తవ్యస్తంగా మారాయి. మున్సిపాలిటీలో మెయిన్‌రోడ్లు, సెల్లార్లు వరద నీటితో నిండిపోయాయి. రైతులు పంట నష్టం, ప్రజలు ఇళ్ల కోల్పోయి దాదాపుగా 20 రోజులు కావస్తున్నా ఎలాంటి పరిహారం అందలేదు. దాంతో వారు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని ప్రధాన కాల్వకు గండ్లు పడగా, సుమారు 12 చెరువులు కోతకు గురయ్యాయి. 13వ బ్రాంచ్ కెనాల్ పరిధిలోని 14వ కిలోమీటర్ వద్ద యూటీ తెగిపోయింది. 18, 22 కిలోమీటర్ల వద్ద ఆధునీకరణ చేసిన కాలువలు కూడా కోతకు గురయ్యాయి. కరక్కాయలగూడెం సమీపంలోని 14వ కిలోమీటర్ వద్ద కాల్వ తెగి యూటీ నుంచి వచ్చిన వరద నీటితో బూరుగడ్డ నల్లచెరువుకు గండి పడింది. బూరుగడ్డ, గోపాలపురం గ్రామాల మధ్య గల ప్రధాన రహదారి వరద నీటిలో కొట్టుకుపోయింది. గోపాలపురం మోదుగు చెరువుకు గండి పడింది. హుజూర్‌నగర్‌లో బట్టవానికుంట తెగిపోయింది. డివిజన్ పరిధిలోని 7 మండలాల్లో 1,300 ఇళ్లు దెబ్బతిన్నాయి. సుమారు రూ.2.10 కోట్ల నష్టం జరిగింది. ఏడు మండలాల్లో ఆర్ అండ్ బీ శాఖకు రూ. 2.8 కోట్ల నష్టం వాటిల్లిందని అధికారులు పేర్కొంటున్నారు. పట్టణంలోని దద్దనాలచెరువు, విఘ్నేశ్వర కాలనీ, శివాలయం వీధి, గంగమ్మ ఆలయం సెంటర్, మట్టపల్లి బైపాస్ రోడ్డు, సింగారం బైపాస్ రోడ్డులోని ఇళ్లల్లోకి నీరు వచ్చి చేరి తీవ్ర నష్టం జరిగింది. మున్సిపాలిటీ పరిధిలో సుమారు రూ.3 కోట్ల పైనే నష్టం జరిగింది. గోవిందాపురం రోడ్డులోని గంగమ్మ ఆలయం వద్ద రోడ్డును కట్ చేసి వరద నీటిని మళ్లించారు. నేటికీ గోవిందాపురం రోడ్డుకు మరమ్మతులు చేసిన దాఖలాలు లేవు. కాగా డివిజన్‌లో అధికారుల లెక్కల ప్రకారం 5వేల ఎకరాల పంట నష్టం జరిగినట్లు అంచనా వేశారు. వాస్తవంగా 12వేల ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు రైతాంగం పేర్కొంటుంది. అధికారులు మాత్రం రూ.7 కోట్ల 26 లక్షలు నష్టం అంచనా వేయగా వాస్తవంగా 12 వేల ఎకరాలకు రూ.16 కోట్ల మేర నష్టం జరిగినట్లు రైతు సంఘాలు పేర్కొంటున్నాయి. పంట పొలాలకు నష్టం తక్కువ చేసి అంచనా వేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

పంట పొలాల్లో ఇసుక మేట

సాగర్ ఆయకట్టులో చెరువు కట్టలు తెగి వరదలతో పంట పొలాల్లో ఇసుక మేట వేసింది. ఎడమ కాల్వ పరిధిలోని మొదటి జోన్‌లో వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. ఆయకట్టు పరిధిలోని ఎంబీ కెనాల్‌కు అనుసంధానంగా ఉన్న ప్రాంతాల్లో పంటల ఆనవాళ్లు లేకుండా పోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. కాల్వకట్టలు, చెరువులకు గండ్లు పడి వరద ప్రవాహంలో పంట పొలాలు మునిగిపోయాయి. మునగాల హెడ్ రెగ్యులేటర్ నుంచి ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ పరిధిలోని 14, 24వ కిలోమీటర్ మేజర్‌తో పాటు రెడ్లకుంట మేజర్‌కు అనేక చోట్ల గండ్లు పడ్డాయి. కాగా 14వ కిలోమీటర్ వద్ద ఎంబీ కెనాల్‌కు పడిన గండిని మూడ్రోజుల క్రితమే పూడ్చారు. ప్రధానంగా కరక్కాయలగూడెం, బూరుగడ్డ గ్రామాల్లో పెద్ద చెరువు కింద సుమారు వందల ఎకరాలు వరద నీటిలో కొట్టుకపోయాయి. అలాగే బూరుగడ్డ, గోపాలపురం గ్రామాల మధ్య నల్లచెరువుకు గండి పడడంతో సుమారు 500 ఎకరాల పంట మునిగిపోయింది. బూరుగడ్డతో పాటు పలు గ్రామాల్లో 200 ఎకరాల పైనే పంటలు వరదనీటికి కొట్టుకపోయి, పొలాల్లో ఇసుక మేటలు వేశాయి. అసలు పంటల ఆనవాళ్లు లేకుండా పోయాయి. కరక్కాయలగూడెం పరిధిలోని లింగకుంట చెరువు కట్ట తెగి అలుగు కొట్టుకపోయి వందల ఎకరాలు కొట్టుకుపోయినట్లు రైతులు పేర్కొన్నారు. వందల ఎకరాల పంట వరదనీటిలో మునిగిపోయింది. ఇక రెండో పంటసాగు చేయాలంటే ఎకరానికి రూ. 50 వేల ఖర్చు చేస్తేనే పంటకు పాత రూపు వస్తుందని రైతాంగం పేర్కొంటుంది. ఒక్క హుజూర్‌నగర్ ప్రాంతంలోనే సుమారు 4 వేల ఎకరాల పైనే పంట నష్టం వాటిల్లినట్లు రైతాంగం ఆవేదన వ్యక్తం చేస్తుంది. మఠంపల్లి, చింతలపాలెం, మేళ్లచెర్వు, గరిడేపల్లి, పాలకవీడు ప్రాంతాల్లో పంట నష్టం జరిగింది. వందల ఎకరాల్లో పత్తిచేను దెబ్బతిన్నది. ఖరీఫ్ సీజన్‌లో వేసిన పంటలు కాపాడుకునేందుకు అన్నదాతలు అవస్థలు పడుతున్నారు.

గండ్లతో చివరి ఆయకట్టుకు నీటి కరువు

పంట నష్టం పరిశీలనకు ఈ నెల 11న కేంద్ర బృందం వచ్చి బూరుగడ్డ చెరువును పరిశీలించింది. వ్యవసాయశాఖకు సంబంధించిన ఉన్నతాధికారులతో పాటు కేంద్ర బృందం సభ్యులు పంట నష్టం అంచనా వేసినప్పటికీ ఎలాంటి సాయం అందలేదు. కాగా రెడ్లకుంట మేజర్ మరమ్మతులు పనులు మరో మూడురోజులు పట్టే అవకాశం ఉందని ఎన్ఎస్‌పీ అధికారులు పేర్కొంటున్నారు. హుజూర్‌నగర్ డివిజన్‌లో వరదల వల్ల సుమారు వివిధ శాఖలకు సంబంధించి రూ.30 కోట్లకు పైగా నష్టం జరిగినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఒకవైపు కాల్వకు గండ్లు పడగా సుమారు 15 రోజుల పాటు నీరు రాకపోవడంతో ఆయకట్టు చివరి భూములకు నీళ్లు అందడం లేదు. మట్టపల్లి, చింతిర్యాల, ముక్తేశ్వరపురం, రామాపురం, కందిబండ, గణపవరం మేజర్ల పరిధిలో రైతులు పత్తి, మిర్చి పంటలు సాగు చేయగా ఆయా పంటలు భారీగా దెబ్బతిన్నాయి. పంటలు కోల్పోయిన రైతులు, ఇళ్ల కోల్పోయిన ప్రజలు ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూస్తున్నారు.

కోదాడ డివిజన్‌లో...

కోదాడరూరల్ : అంతర్‌గంగ వాగు ఉధృతికి కూచిపూడి, తొగర్రాయి గ్రామాల్లో పంటలకు భారీగా నష్టం వాటిల్లింది.పంట నష్టపోయి దాదాపుగా 20 రోజులు కావస్తున్నా తమను ఆదుకునేందుకు ఎవ్వరూ ముందుకు రాలేదని గ్రామానికి చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది తొగర్రాయి, కూచిపూడి గ్రామాల్లో సుమారు 5 వేల హెక్టార్లలో సాగుచేశారు. అయితే వరదల వల్ల 1,500 ఎకరాలకు పైగా వరి పంటకు నష్టం ఏర్పడగా 500 ఎకరాల్లో నష్టం జరిగిందని వ్య వసాయాధికారులు తేల్చారని రైతులు వాపోతున్నారు. ఎకరానికి రూ.20 నుంచి 25 వేలకు పైగా పంటలకు ఖర్చు చేశామన్నారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.10 వేలు కూడా అందలేదన్నారు. ఇసుక మేటలు తొలగించేందుకు ఎకరానికి రూ.30 నుంచి 40 వేల వరకు ఖర్చు వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

ఇటీవల కురిసిన భారీ వర్షాలు వరదల వల్ల కోదాడ డివిజన్‌లో 15వేల ఎకరాలకుపైగా 70గ్రా మాల్లో 5,134మంది రైతులకు చెందిన 15,024ఎకరాల్లో పంట నష్టం జరిగింది. పంట దెబ్బతిన్నట్లు వ్యవసాయాధికారులు పేర్కొన్నారు. కోదాడ మండలంలో 12 గ్రామాల్లో 1,430 మంది రైతులకు చెందిన 5,350 ఎకరాలు పంట నష్టం సంభవించినట్లు తెలిసింది. చిలుకూరు మండలంలో 11 గ్రామాల్లో 1,503 రైతులకు చెందిన 3,009 ఎకరాల్లో పంట నష్టం అయింది. అనంతగిరిలో 9 గ్రామాల్లో 432 మంది రైతులకు చెందిన 2,619 ఎకరాల్లో పంట నష్టం జరిగింది. మోతె 15 గ్రామాల్లో 915 మంది రైతులకు 2,455 ఎకరాల్లో పంట దెబ్బతిన్నది. మునగాల 17 గ్రామాల్లో 379 మంది రైతులకు చెందిన 601 పంట నష్టం జరిగింది. నడిగూడెం 4 గ్రామాల్లో 480 మంది రైతులకు చెందిన 990 ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నది. ఈ విషయంపై వ్యవసాయ శాఖ అధికారులకు, రైతుల పంట నష్టం జరిగిన వివరాల్లో పొంతన లేకుండా ఉన్నాయని రైతులు పేర్కొంటున్నారు. సమగ్ర విచారణ చేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని కోరుతున్నారు.


కొట్టుకుపోయిన దుకాణాలు

మండలంలోని యర్రవరంలోని శివదేవుని కుంట (చెరువు)కట్ట తెగిపోయి పెద్దఎత్తున వరద వచ్చి తమ షాపులన్నీ కొట్టుకుపోయాయి. ఈ కుంట (చెరువు)కింద సుమారు 50 ఎకరాలకు పైగా విస్తీర్ణం ఉంది. అంతేకాకుండా బాల ఉగ్ర నర్సింహస్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన పదికి పైగా దుకాణాలు నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాయి. ఇప్పటివరకు అధికారులు కానీ, గ్రామంలో ప్రజాప్రతినిధులు కానీ పట్టించుకున్న దాఖలాలు లేవని బాధితులు పేర్కొంటున్నారు. ఒక్కో దుకాణానికి రూ. 30 నుంచి 40 వేల వరకు నష్టపోయామని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

నిలిచిపోయిన రాకపోకలు

శివదేవుని కుంట (చెరువు) తెగిపోయి గ్రామానికి రాకపోకలు నిలిచిపోయామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువు కట్ట నుంచి కొద్దిపాటి కట్టపోయడం వల్ల కట్ట మీద నుంచి ద్విచక్ర వాహనాలు మినహా. మిగతా వాహనాలకు ప్రయాణించే పరిస్థితి లేదని కట్టను పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయాలని కోరారు.

దెబ్బతిన్న వరి పంటలు



రూ.30వేల పరిహారం చెల్లించాలి



వరదల వల్ల నష్టపోయిన రైతాంగానికి ప్రభుత్వం ఎకరానికి రూ.30వేలు చెల్లించాలి.హుజూర్‌నగర్ డివిజన్‌లో రూ.15వేల ఆయకట్టు నష్టం జరిగింది.అధికారులు సమగ్ర సర్వేచేసి రైతులను ఆదుకోవాలి. అప్పులు చేసి పంటలు సాగుచేశాం.

- కొప్పుల సైదిరెడ్డి, అమరవరం

నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం

శివదేవుని కుంట కట్ట తెగిపోయి ఎర్రవరంలో సుమారు 30 ఎకరాలకు పైగా వరి పంటకు నష్టం జరిగింది.కుంట కింద ఉన్న షాపులు సైతం కొట్టుకుని పోయాయి. ప్రభుత్వానికి చెరువు కట్ట మరమ్మతు కోసం ప్రతిపాదనలు పంపాంఅని నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం.

- ఏఈ సత్యనారాయణ.

పంట నష్టం ప్రభుత్వానికి నివేదిక పంపాం



పంట నష్టంపై ప్రభుత్వానికి నివేదిక పంపాం. కోదాడ డివిజన్ వ్యాప్తంగా 15 వేల ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నది అన్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు, వ్యవసాయ సిబ్బంది విచారణ చేసి నివేదిక అందించారు.

- ఎల్లయ్య,ఏడీ

ఏకపక్షంగా సీఈవోను సస్పెండ్ చేశారు

యర్రవరం పీఏసీఎస్ డైరెక్టర్ల ఆరోపణ



కమిటీ సభ్యులతో వాగ్వాదం చేస్తున్న రైతులు

కోదాడ రూరల్, సెప్టెంబరు 21: కోదాడ మండలం యర్రవరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం సీఈవో హుస్సేన్‌ను చైర్మన్ నలజాల శ్రీనివాస్ ఏకపక్షంగా నిర్ణయం తీసుకుని సస్పెండ్ చేశారని పలువురు సంఘం డైరెక్టర్లు ఆరోపించారు. శనివారం సహకార సంఘ భవనంలో సహకార సంఘ కమిటీ అత్యవసర సమావేశం జరిగింది. చైర్మన్‌తో కలిసి మొత్తం 13 మంది డైరెక్టర్లు ఉన్న ఈ సంఘంలో చైర్మన్, వైస్ చైర్మన్ మినహా మిగతా డైరెక్టర్లంతా సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీన నిర్వహించిన సహకార సంఘం సమావేశానికి డైరెక్టర్లంతా హాజరుకాలేదని, అదే రోజున చైర్మన్ ఏకపక్షంగా నిర్ణయం తీసుకుని సీఈవోను, కంప్యూటర్ ఆపరేటర్‌ను సస్పెండ్ చేశారని ఆరోపించారు. సహకార సంఘ పరిధిలో 66మంది రైతులకు చెందిన సుమారు రూ.30లక్షల రుణమాఫీ కాలేదని, ఈ విషయంలో చైర్మన్, సీఈవోల మధ్య సమన్వయం లేకపోవడమే కారణమని డైరెక్టర్లు ఆరోపించారు. సీఈవో, కంప్యూటర్ ఆపరేటర్‌ను రుణమాఫీ అయ్యే వరకూ విధుల్లో కొనసాగించాలని తీర్మానించారు. రుణమాఫీ ప్రక్రియ పూర్తి కాకుండానే సస్పెండ్ చేయడం సముచితం కాదన్నారు.

రుణమాఫీ వర్తింపజేయాలని రైతుల ఆందోళన

యర్రవరం సహకార సంఘం పరిధిలో 66మంది రైతులకు రూ.30లక్షల రుణమాఫీ వర్తించకపోవడం వల్ల రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ శనివారం సహకార సంఘ భవనం ఎదుట ఆందోళన నిర్వహించి డైరెక్టర్లను నిలదీశారు. చైర్మన్, సీఈవో, కంప్యూటర్ ఆపరేటర్ తప్పిదాల వల్లే రుణమాఫీ కాలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా తమకు రుణమాఫీ వర్తింపజేయాలని కోరారు. ఈ విషయంలో డైరెక్టర్లు, రైతుల మధ్య కొద్దిసేపు వాగ్వాదం నెలకొంది. కమిటీ సమావేశానికి చైర్మన్, వైస్ చైర్మన్ హాజరుకాకపోవడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.



ప్రైవేట్ వ్యక్తుల పేరిట ప్రభుత్వ భూమి

- ధరణి ఆపరేటర్ భూఅక్రమాలు
- 36.23 ఎకరాల ప్రభుత్వ భూమి బదలాయింపు
- మొత్తం భూమి విలువ రూ.18 కోట్లపైనే
- తల్లి, చెల్లి, కుటుంబ సభ్యుల పేరిట ఆన్‌లైన్‌లో నమోదు
- మరింత విచారణకు కలెక్టర్ ఆదేశం

•7లో..

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు

» స్వామివారిని దర్శించుకున్న రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని



నిత్య కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, సెప్టెంబరు 21 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దివ్యక్షేత్రంలో శనివారం శాస్త్రోక్తంగా నిత్య పూజలు జరిగాయి. సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొలిపిన అర్చకస్వాములు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను వేదమంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ పంచామృతాలతో అభిషేకించి, తులసీ దళాలతో అర్చించారు. ప్రాకార మండపంలో సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో వైభవంగా చేపట్టారు. అష్టభుజి ప్రాకార మండపంలో స్వామి అమ్మవారిని మనోహరంగా అలంకరించి, ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విశ్వక్సేనుడి తొలిపూజలతో నిత్య తిరుకల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో చేపట్టారు. ప్రధానాలయ ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు సాయంత్రం అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు నిర్వహించారు. పాతగుట్ట ఆలయంలో నిత్య కైంకర్యాలు వేదమంత్రాలు మంగళవాయిద్యాల నడుమ వైభవంగా నిర్వహించారు. శివాలయంలో నిత్యారాధనలు, రుద్రహవన పూజలు శైవాగమ పద్ధతిలో కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.17,69,083 ఆదాయం సమకూరినట్లు ఈఓ భాస్కర్‌రావు తెలిపారు. కాగా, స్వామివారిని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఐ.రాణికుముదిని, ప్రముఖ సినీ దర్శకుడు పూరి జగన్నాథ్ కొడుకు ఆకాశ్ దర్శించుకున్నారు. వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా,ఈఓ లడ్డూ ప్రసాదం అందజేశారు.

నేడు మంత్రుల రాక

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి ఆదివారం రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుతో పాటు భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, ఎమ్మెల్సీ నవీన్ (తీన్మార్‌మల్లన్న) దర్శించుకోనున్నారు. ఉదయం ఆలయంలో స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేస్తారు. మంత్రుల రాక సందర్భంగా ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. అనంతరం నియోజకవర్గ కేంద్రంలో ఆలేరు మార్కెట్ కమిటీ ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు.

గిరిప్రదక్షిణ చుట్టు బెంచీలు

యాద'గిరి'గుట్ట ప్రదక్షిణలు చేసే భక్తుల కోసం శనివారం భువనగిరి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పద్మజా ఆసుపత్రి సహకారంతో బెంచీలు ఏర్పాటు చేశారు. గిరిప్రదక్షిణ చేసే దారిలో భక్తులు సేద తీరేందుకు 33సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశారు.సేవ దృక్పథంతో ఏర్పాటు చేసిన బెంచీలు మరిన్ని అందుబాటులోకి తేనున్నట్టు క్లబ్ అధ్యక్షుడు కరిపె నర్సింగ్‌రావు, కార్యదర్శి కూచిపట్ల సత్యనారాయణరెడ్డి, కోశాధికారి ఇటికాల దేవంద్రచారి, క్లబ్ మాజీ అధ్యక్షుడు పడమటి జగన్మోహన్‌రెడ్డి, బాలయ్య, పలుగుల ఆగేశ్వరరావు, వేమూరి అశోక్, హరికృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

పేద కుటుంబాన్ని వరించిన ప్రభుత్వ ఉద్యోగం

» గట్టికల్ యువకుడు సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా ఎంపిక



సూర్యాపేట, సెప్టెంబరు 21: నిరుపేద దళిత కుటుంబం జన్మించి స్వశక్తితో ఎదిగి ప్రభుత్వ ఉద్యోగం సాధించి తోటి వారికి ఆదర్శంగా నిలుస్తున్నాడు ఆత్మకూర్ (ఎస్) మండలం గట్టికల్ గ్రామానికి చెందిన గాదె కోటేశ్. పోస్టు గ్రాడ్యుయేట్ పూర్తి చేసి ప్రైవేట్ విద్యాసంస్థల్లో పనిచేస్తూనే, ప్రతిరోజు పాలను విక్ర యించి, అనంతరం తాను పనిచేసే కళాశాలలో విధుల్లోకి వెళ్లే యువకుడు నేడు సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా ఉద్యోగం సంపాదించాడు. 2022లో వచ్చిన నోటిఫికేషన్‌కు ఈ ఏడాది జూన్‌లో పరీక్ష రాశాడు. శనివారం విడుదలైన ఫలితాల్లో సోషల్ వెల్ఫేర్ అధికారిగా కోటేశ్ ఎంపికయ్యాడు. కోటేశ్‌కు రాష్ట్రస్థాయిలో 37వ ర్యాంకు వచ్చింది. యాదాద్రి భువనగిరి జోన్-5లో 9వర్యాంకు సాధించాడు. 2020లో కరోనా సమయంలో గట్టికల్‌లో డెయిరీ ఫామ్ ఏర్పాటు చేసి వివిధ గ్రామాల నుంచి పాలు తెచ్చి సూర్యాపేట, కుడకుడ, పీఎస్ఆర్ టౌన్‌షిప్‌లలో ఇంటింటికీ తిరిగి పాలు విక్రయించేవాడు. కోటేశ్‌కు ప్రభుత్వ ఉద్యోగం రావడం పట్ల గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

అధికారుల అండతో ఇసుక దందా

● బంగారంతో పోటీపడుతున్న ఇసుక ధర



ట్రాక్టర్ లోడుతో వెళ్తున్న ఇసుక

మద్దిరాల, సెప్టెంబరు 21 : అధికారుల అండతో సూర్యాపేట జిల్లా మద్దిరాలలో ఇసుక విక్రయాలు యధేచ్ఛగా సాగుతున్నాయి. గుట్టుచప్పుడు కాకుండా రాత్రి వేళల్లో ఇసుకను అక్రమంగా తరలించి కాసులు దండుకుంటున్నారు. పర్యవేక్షణ చేయాల్సిన రెవెన్యూ, పోలీస్ సిబ్బంది చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా గ్రామాల్లో ప్రజలు ఇంటి ప్రహరీలు, మరుగుదొడ్ల నిర్మాణాల కోసం ఇసుక అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని పాలేరు వాగు, జీ కొత్తపల్లి, ముకుందాపురం, పీర్యాతండా నుంచి రాత్రివేళ ఇసుకను జోరుగా ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. ఒక్కో ఇసుక ట్రాక్టర్ ధర రూ.5500నుంచి రూ.6500వరకు విక్రయాలు జరుగుతున్నాయి. ఇసుక ధరలను చూసి ప్రజలను బంగారంతో పోల్చుకుంటున్నారు. బంగారం మాదిరే ఇసుక ధరలు మండిపోతున్నాయని సామాన్యులు వాపోతున్నారు.

మా దృష్టికి రాలేదు, వస్తే చర్యలు తీసుకుంటా



మండలంలోని పాలేరు వాగు నుంచి ఇసుకను తరలిస్తున్నట్లు మా దృష్టికి తీసుకువస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. కొంతమంది అధికారులు ఇసుకను గుట్టు చప్పుడు కాకుండా తరలిస్తే వారిపై కూడా చర్యలు ఉంటాయి. ప్రభుత్వం నుంచి ఇసుక రవాణాకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు.

- వీరన్న, ఎస్ఐ మద్దిరాల మండలం

డీసీఎం ఢీకొని ట్రాక్టర్ డ్రైవర్ మృతి



శేఖర్(ఫైల్)

మాడ్గులపల్లి, సెప్టెంబరు 21 : డీసీఎం, బైక్ ఢీకొన్న సంఘటనలో వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలకేంద్రంలోని అద్దంకి-నార్కట్‌పల్లి రహదారిపై శనివారం జరిగింది. ఎస్ఐ శోభన్‌బాబు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఇందుగుల ఆవాస గ్రామమైన మలపరాజుగూడెం గ్రామానికి చెందిన పుట్ట శేఖర్(32) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవిస్తున్నాడు. డీజిల్ కోసం శనివారం ఉదయం బైక్‌పై మాడ్గులపల్లి మండలకేంద్రానికి వచ్చి తిరిగి వెళ్తున్నాడు. చెన్నై నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న డీసీఎం అతివేగంగా బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టడంతో తీవ్రగాయాలైన శేఖర్ అక్కడికక్కడే మృతిచెందాడు. శేఖర్ మృతదేహాన్ని మిర్యాలగూడ ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం పోలీసులు కుటుంబసభ్యులకు అప్పగించారు. శేఖర్‌కు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కాగా భార్య మనీషా ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని ప్రమాదానికి కారణమైన డీసీఎం డ్రైవర్ నిజాంఖాన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శోభన్‌బాబు తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు..



సైదులు(ఫైల్)

సూర్యాపేట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండలం కందగట్ల గ్రామంలో విద్యుదాఘాతంతో రైతు మృతి చెందాడు. శనివారం స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రైతు మంచాల సైదులు(62) తన వ్యవసాయ బావివద్ద పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లాడు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ ఆఫ్ అయి ఉండడంతో ఆన్‌చేయగా శిథిలావస్థలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వైరు తెగి మీద పడింది. దీంతో విద్యుదాఘాతానికి గురై తీవ్రగాయాలయ్యాయి. సమీపంలో ఉన్న మహిళా రైతు గమనించి స్థానికులకు సమాచారం ఇచ్చింది. ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేయగా అప్పటికే మృతి చెందాడు. సైదులుకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

పాముకాటుతో 15 నెలల చిన్నారి..



పవిత్ర(ఫైల్)

చందంపేట, సెప్టెంబరు 21: పాముకాటుతో 15 నెలల చిన్నారి మృతి చెందింది. ఈ సంఘటన శనివారం నల్లగొండ జిల్లా చందంపేట మండలం పొగిళ్ల గ్రామంలో జరిగింది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పొగిళ్ల గ్రామానికి చెందిన జటావత్ గంగ, కిషన్ దంపతులు వ్యవసాయం చేసుకుంటు జీవిస్తున్నారు. శనివారం వ్యవసాయ పనులు ముగించుకొని రాత్రి భోజనం అనంతరం ఇంట్లో కింద నిద్రించారు. దంపతులకు ఒక్కగానొక్క కుమార్తె పవిత్ర (15 నెలలు) అర్ధరాత్రి ఏడుస్తుండడంతో మేలుకున్న తల్లిదండ్రులు పాప పక్కలో పాము ఉండటం చూసి కాటుకు గురైనట్లు గుర్తించారు. పామును చంపి చిన్నారిని చికిత్స కోసం దేవరకొండకు తరలిస్తుండగా మార్గమధ్యలో పాప మృతి చెందింది. కుమార్తె మృతితో విషాదం నెలకొంది.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ గుర్తుతెలియని వ్యక్తి

మిర్యాలగూడ అర్బన్, సెప్టెంబరు 21 : రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి గాయపడ్డాడు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలంలో ఈనెల 19న జరిగిన సంఘటన వివరాలను రూరల్ ఏఎస్ఐ రాములునాయక్ శనివారం తెలిపారు. నార్కట్‌పల్లి- అద్దంకి రహదారి పక్కన గూడూరు గ్రామం వద్ద నిలబడి ఉన్న వ్యక్తిని దామరచర్ల నుంచి మిర్యాలగూడకు వస్తున్న బైక్ ఢీకొట్టగా తలకు గాయాలైనట్లు తెలిపారు. దామరచర్ల మండలం కొండ్రపోలు పరంగి మధు అనే వ్యక్తి తన బైక్‌ను అజాగ్రత్తగా నడిపి ప్రమాదానికి కారణం కావడంతో గూడూరు గ్రామకార్యదర్శి రాజశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏఎస్ఐ తెలిపారు. కాగా గాయపడ్డ వ్యక్తికి మతిస్థిమితం సరిగ్గా లేదని, వయసు సుమారు 55 ఏళ్ల వరకు ఉంటుందని, ప్రస్తుతం మిర్యాలగూడ ఏరియాఆస్పత్రిలో చికిత్స పొం దుతూ కోలుకుంటున్నట్లు ఏఎస్ఐ తెలిపారు. ఇతర వివరాల కోసం 9441562204 నెంబరుకు సమాచారం అందించాలని ఏఎస్ఐ రాములునాయక్ కోరారు.

అత్తారింటి వేధింపులు తాళలేక ఆత్మహత్య




కరుణ(ఫైల్)

శాలిగౌరారం, సెప్టెంబరు 21 : అత్తారింటి వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం ఆకారం గ్రామంలో శనివారం జరిగింది. ఎస్ఐ సైదులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆకారం గ్రామానికి చెందిన సూరారపు రాజుకు నార్కట్‌పల్లి మండలం అమ్మనబోలు గ్రామానికి చెందిన కరుణతో ఆరేళ్ల కిందట వివాహమైంది. వీరికి మూడేళ్ల లోపు కుమార్తె, కుమారుడు ఉన్నారు. సూరారపు రాజు మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని భార్య కరుణను నిత్యం వేధిస్తున్నాడు. తరచూ భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో కరుణ మనస్తాపం చెంది ఇంట్లో ముభావంగా ఉంటోంది. శుక్రవారం రాత్రి ఇంట్లో ఉన్న నిద్రమాత్రలు వేసుకుంది. శనివారం తెల్లవారుజామున చనిపోయి ఉండటంతో భర్త రాజు తన మామ మాతంగి నర్సయ్యకు సమాచారం అందించారు. కుమార్తె మృతికి అల్లుడు రాజుతో పాటు కుటుంబసభ్యులు కూడా కారణమని నర్సయ్య పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ఆస్పత్రికి తరలించారు.

రైస్‌మిల్లర్లపై కేసులు నమోదు

తిరుమలగిరి, సెప్టెంబరు 21 : కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) ఇవ్వని ఇద్దరు రైస్‌మిల్లు యజమానులపై కేసులు నమోదయ్యాయి. ఇందుకు సంబంధించి సూర్యాపేట జిల్లా తిరుమలగిరి ఎస్ఐ సురేష్ శనివారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సివిల్ సప్లయ్ అసిస్టెంట్ మేనేజర్ బెనర్జీ ఫిర్యాదు మేరకు శ్రీలక్ష్మి రైస్ ట్రేడర్స్, హర్షిత రైస్‌మిల్లు యజమానులు గజ్జి ఉపేందర్, తునికిపాటి వినయ్ కుమార్‌లపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. 2022-24 అన్ని సీజన్లకు కలిపి శ్రీలక్ష్మీ ట్రేడర్స్ నుంచి రూ.25.40 కోట్లు, హర్షిత మిల్లు నుంచి రూ.16.28కోట్లు బకాయిలు ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు.

భీమనపల్లి గ్రామంలో అంబేద్కర్ విగ్రహం ధ్వంసం



ధ్వంసమైన అంబేద్కర్ విగ్రహం

భూదాన్‌పోచంపల్లి, సెప్టెంబరు 21: యాదాద్రి-భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం భీమనపల్లి గ్రామంలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. శనివారం ఉదయం విగ్రహం ధ్వంసమై ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను గుర్తించి వారిపై కఠినచర్యలు తీసుకోవాలని అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు మీసాల గణేష ఎస్ఐ భాస్కర్‌రెడ్డికి ఫిర్యాదుచేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు యాట కైలాసం, నాయకులు మీసాల గణేష్, కొమ్ము రమేష్, గూని బుచ్చయ్య, చెరుకు రాములు, కొమ్ము లింగస్వామి, మీసాల ప్రశాంత్, మీసాల తరుణ్, కొమ్ము రాకేష్, కొమ్ము సురేష్ పాల్గొన్నారు.

ప్రైవేట్ వ్యక్తుల పేరిట ప్రభుత్వ భూమి

- ధరణి ఆపరేటర్ భూఅక్రమాలు
- 36.23 ఎకరాల ప్రభుత్వ భూమి బదలాయింపు
- మొత్తం భూమి విలువ రూ.18 కోట్లపైనే
- తల్లి, చెల్లి, కుటుంబ సభ్యుల పేరిట ఆన్‌లైన్‌లో నమోదు
- మరింత విచారణకు కలెక్టర్ ఆదేశం



జగదీష్ ప్రైవేట్ వ్యక్తుల పేరిట నమోదు చేసిన ప్రభుత్వ భూమి ఇదే

రెవెన్యూ ఉన్నతాధికారుల అండదండలతో ధరణి ఆపరేటర్ అక్రమాలకు పాల్పడ్డాడు. ఏకంగా ప్రభుత్వ భూములను తన కుటుంబ సభ్యుల పేరు ధరణి రికార్డుల్లో నమోదు చేయించారు. డిజిటల్ పాస్‌పుస్తకాలు పొంది మూడేళ్లుగా రైతుబంధు పొందుతున్నాడు. ఎకరం, రెండు ఎకరాలు కాదు ఏకంగా 36 ఎకరాల పైనే ధరణిలో చేర్చి పట్టాదార్ పాస్‌పుస్తకాలు పొందడం గమనార్హం. మొత్తం భూమి విలువ రూ.18 కోట్లకు పైగానే ఉంటుందని సమాచారం. ప్రస్తుతం ధరణి ఆపరేటర్‌ను రెవెన్యూ అధికారుల ఫిర్యాదుతో పోలీసులు విచారిస్తున్నారు.

- హుజూర్‌నగర్

సూర్యాపేట జిల్లాలో ధరణి పోర్టల్‌లో చోటుచేసుకున్న అక్రమాలు చర్చనీయాంశంగా మారాయి. హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని ఒక రెవెన్యూ అధికారిపై భూమార్పిడికి సంబంధించి జిల్లా ఉన్నతాధికారులు విచారణ జరుపుతున్న సమయంలో హుజూర్‌నగర్ మండలం బూరుగడ్డలో జరిగిన అక్రమ భూమి పట్టా మార్పిడి వివరాలు వెల్లడించినట్లు తెలిసింది. తానొక్కడినే తప్పు చేయలేదని, ఇలాంటి తప్పులు హుజూర్‌నగర్ మండలంలో చాలా జరిగాయని చెప్పినట్లు సమాచారం. దీంతో ధరణి ఆపరేటర్ భూదందా వ్యవహారం వెలుగుచూసినట్లు తెలుస్తోంది. అయితే వెలుగుచూసింది గోరంత కాగా ఇంకా కొండంత ఉందని రెవెన్యూ వర్గాలే పేర్కొంటున్నాయి.

హుజూర్‌నగర్ తహసీల్దార్ కార్యాలయ ధరణి ఆపరేటర్ వత్సవాయి జగదీష్ తన కుటుంబ సభ్యులు, బంధువుల పేరు మీద ఏకంగా 36. 23 ఎకరాల భూమిని ధరణ పోర్టల్‌లో నమోదుచేసినట్లు ఇటీవల జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ శుక్రవారం రాత్రి వెల్లడించారు. 2019-20లో హుజూర్‌నగర్ మండలంలో పనిచేసిన ఉన్నతాధికారుల అండదండలతోనే ధరణి ఆపరేటర్ జగదీష్ ఈ దందాకు పాల్పడినట్లు సమాచారం. హుజూర్‌నగర్ మండలంలోని బూరుగడ్డ రెవెన్యూ పరిధిలో వేణుగోపాలస్వామి దేవాలయం, గోపాలపురం శివారు, పెద్దచెరువు, నల్ల చెరువు ప్రాంతాల్లో 36.23 ఎకరాల ప్రభుత్వ మిగులు భూమి ఉంది. ఆ భూమిని కొంతమంది వ్యక్తులు సాగు చేసుకుంటున్నారు. ఎకరం ఇక్కడ రూ.50 లక్షలపైనే ఉంది. ఈ భూమి విలువ సుమారు రూ.18కోట్లపైనే ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. కోట్లు విలువచేసే భూమిని రెవెన్యూ అధికారుల అండందండలతో జగదీష్ అతడి కుటుంబ సభ్యుల పేరు మీద పోర్టల్‌లో నమోదు చేశాడు. బూరుగడ్డ గ్రామంలో 439 సర్వే నెంబర్‌లో 164 ఎకరాల 12 కుంటల భూమి, 604 సర్వే నెంబర్‌లో 164 ఎకరాల భూమి ఉంది. అతిపెద్ద సర్వేనెంబర్లు కావడంతో ప్రభుత్వ మిగులు భూమి అధికంగా ఉంది. వీటితో పాటుగా 602, 608, 1041 సర్వే నెంబర్లలో ప్రభుత్వ భూమి ఉండగా వాటన్నింటిని ధరణి ఆపరేటర్ కుటుంబ సభ్యుల పేరు మీద పోర్టల్‌లో నమోదుచేసినట్లు అధికారులు గుర్తించారు. 2019 నవంబరు నుంచి 2020 ఫిబ్రవరి మధ్య కాలంలో భూమి బదలాయింపులు జరిగినట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు. భూమి బదలాయింపుతో పాటు రైతుబంధు, రైతురుణమాఫీ లబ్ధికూడా పొందినట్లు సమాచారం. ప్రభుత్వ భూమి పట్టా మార్పుపై కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీవో శ్రీనివాసులు విచారణ జరిపి మూడు రోజుల కిందట నివేదిక అందించారు. ఆ నివేదిక వివరాలను డీపీఆర్వో రమేష్ శుక్రవారం రాత్రి మీడియాకు విడుదల చేశారు. అదేవిధంగా కలెక్టర్ ఆదేశాల మేరకు ధరణి ఆపరేటర్ జగదీష్‌ను డిస్మిస్ చేశారు. స్థానిక రెవెన్యూ అధికారులు ఇచ్చిన ఫిర్యాదుతో జగదీష్‌ను పోలీసులు అరెస్ట్ చేసి విచారిస్తున్నారు.

జగదీష్ పట్టా చేసిన ప్రభుత్వ భూములు ఇవే

బూరుగడ్డ గ్రామంలోని సర్వే నెంబర్ 439/55/5లో 8 ఎకరాల 38 గుంటలు, 604/116లో 7.32 గుంటల భూమిని పచ్చిపాల ప్రియాంక పేరు మీద పోర్టల్‌లో నమోదు చేశారు. మొత్తంగా 15.7 ఎకరాలు ఆమె పేరు మీద నమోదుచేశారు.

సర్వే నెంబర్ 604/58లో 4.38 గుంటలు మడిపల్లి స్వప్న సోదరి పేరు మీద నమోదుచేశారు.

హుజూర్‌నగర్‌లోని 602/102/1లో 0.01 గుంటలు, 608/16లో 8.0 ఎకరాల భూమిని జగదీష్ తల్లి వత్సవాయి ఇందిర పేరు మీద నమోదు చేశారు.

అదేవిధంగా 1041/144లో 6.25 ఎకరాలు, 1041/368/3/2/5లో 0.10 గుంటల భూమిని ఇందిర పేరు మీద ఇలా మొత్తం 36.23 కుంటల ప్రభుత్వ భూమిని నిబంధనలకు విరుద్ధంగా ధరణి పోర్టల్‌లో నమోదు చేసినట్లు విచారణలో తేలింది.

కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ చేశాం



కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశాల మేరకు బూరుగడ్డలోని పలు సర్వే నెంబర్లకు సంబంధించి విచారణ చేశాం. ధరణి ఆపరేటర్ జగదీష్ అతడి తల్లి, చెల్లి, కుటుంబ సభ్యుల పేరు మీద 36.23 ఎకరాలు నిబంధనలకు విరుద్ధంగా ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు విచారణలో తేలింది. నివేదికను కలెక్టర్‌కు అందించడంతో అదనపు కలెక్టర్ లతను పూర్తి విచారణ చేయాలని ఆదేశించారు. మండలంలో, పట్టణంలో ధరణిలో జరిగిన అవకతవకలపై మరోసారి కలెక్టర్‌కు నివేదిక ఇస్తాం.

శ్రీనివాసులు, ఆర్డీవో, హుజూర్‌నగర్

విచారణకు ఆదేశం

బూరుగడ్డలో 36.23 ఎకరాల ప్రభుత్వ భూమి ప్రైవేట్ వ్యక్తుల పరం చేసిన అక్రమాలపై పూర్తి విచారణ కోసం అదనపు కలెక్టర్ లతను కలెక్టర్ తేజస్‌నందాలాల్ పవార్ నియమించారు. అప్పటి అధికారులపై సైతం విచారణ చేయాలని ఆదేశించారు. ధరణ ఆపరేటర్‌పైనే నెపమంతా నెట్టేసి అధికారులు తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. కోట్లు విలువచేసే భూమి ఉన్నతాధికారుల సహకారం లేకుండా డిజిటల్ సంతకాలు ఎలా చేస్తారన్న అనుమానాలు ఉన్నాయి. దీంతో అప్పటి అధికారులను కూడా విచారించనున్నట్లు సమాచారం.

ఇతర గ్రామాల్లోనూ ప్రభుత్వ భూమి బదలాయింపు

హుజూర్‌నగర్ మండలం బూరుగడ్డలోనే కాకుండా హుజూర్‌నగర్ పట్టణం, లింగగిరి, అమరవరం, వేపలసింగారం, శ్రీనివాసపురం గ్రామాల్లో సైతం ధరణిలో ఇష్టానుసారంగా నిబంధనలకు విరుద్ధంగా రెవెన్యూ అధికారుల అండతో ప్రభుత్వ భూములను పక్కనే ఉన్న భూస్వాముల పేరు మీద ధరణి పోర్టల్‌లో నమోదు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. హుజూర్‌నగర్ పట్టణంలో 1041, 608, 154, 273 సర్వేనెంబర్లతో పాటు మరికొన్ని నెంబర్లలో సుమారు 300 ఎకరాలపైనే ప్రభుత్వ భూములను సన్న, చిన్నకారు రైతులకు, భూస్వాములకు ధరణి పోర్టల్‌లో నిబంధనలకు విరుద్ధంగా నమోదు చేసినట్లు తెలుస్తోంది. హుజూర్‌నగర్ పట్టణంలోని గోవిందాపురం, ముక్త్యాల మేజర్ కాల్వ సమీపంలో రామస్వామి గుట్టకు వెళ్లే దారిలో, వేపలసింగారం రోడ్డు, మట్టపల్లి, లింగగిరి రోడ్డులోని ప్రభుత్వ భూములు ప్రైవేట్ వ్యక్తుల పేర్ల మీద రికార్డుల్లోకి ఎక్కించినట్లు సమాచారం. ఇక్కడ పనిచేసిన రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమిని రికార్డులలో అక్రమంగా నమోదుచేసినట్లు విమర్శలు ఉన్నాయి. ధరణి వచ్చినప్పటి నుంచి ఆన్‌లైన్‌లో నమోదు చేయగా అంతకుముందు మాన్యువల్‌గా రికార్డుల్లో నమోదు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇదిలా ఉండగా అధికారులకు తెలిసిన, బయటపడిన సమాచారం రూపాయిలో 10 పైసల వంతేనని, మిగిలిన 90 శాతం భూముల పరిస్థితి ఏంటని రైతులు ప్రశ్నిస్తున్నారు. పూర్తిస్థాయిలో ప్రభుత్వ భూముల లెక్కలు తీసి బదలాయింపు జరిపిన వివరాలపై విచారణ చేయాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

నీరందడం లేదని కాల్వలో రైతుల నిరసన



గోపాలపురం వద్ద డీ-37 కాల్వలో నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

మాడ్గులపల్లి, సెప్టెంబరు 21: నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలంలో సాగునీటి కోసం రైతులు శనివారం కాల్వలో నిలబడి నిరసన తెలిపారు. పంట పొలాలు ఎండిపోతున్నాయని, రెండు నెలలుగా కాల్వ నీటి కోసం ఎదురుచూస్తున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎడమ కాల్వ పరిధిలోని డీ-37 కాల్వ నల్లగొండ మండలం గుండ్లపల్లి వద్ద ప్రారంభమై కనగల్, తిప్పర్తి, మాడ్గులపల్లి మండలంలోని కన్నెకల్ వరకు సుమారు 27.05 కిలో మీటరు వరకు ఉంది. సుమారు 42వేల ఎకరాల్లో ఆయకట్టుకు నీరందించడంతో పాటు 19 చెరువులను నింపేందుకు ప్రభుత్వం ఈ కాల్వ నిర్మించింది. ఏఎమ్మార్పీ కాల్వ ద్వారా నీటి విడుదల ఆగస్టు నుంచి కొనసాగుతున్నా, చివరి భూములకు నీరు రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో మాడ్గులపల్లి మండలం గోపాలపురం, మాచినపల్లి గ్రామాలకు చెందిన 20మంది రైతులు శనివారం కాల్వలో నిలబడి నిరసన తెలిపారు. రెండు నెలలుగా కాల్వకు నీటి విడుదల చేసినా చివరి భూములకు రావడంలేదని దీంతో పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వరితో పాటు ఎక్కువ మంది రైతులు బత్తాయి సాగు చేశారు. కాల్వకు నీరు రాకపోవడంతో బోరుబావులు అడుగంటిపోయాయని, కాల్వలో నీటి విడుదల సామర్థ్యాన్ని పెంచితే చివరి భూములకు నీరందడంతో పాటు భూగర్భజలాలు పెంపొందుతాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఎగువన ఉన్న అన్నారం, బసిరెడ్డిపల్లి, ముశంపల్లి, ఎల్లపల్లి గ్రామాల రైతులు కాల్వకు అక్రమ తూములు ఏర్పాటుచేయడంతో నీరు చివరి భూములకు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి వేళల్లో నీటి కోసం వెళ్తే బసిరెడ్డిపల్లి గ్రామస్థులు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. డీ-37 కాల్వ ద్వారా చివరి భూములకు నీరందితే మాడ్గులపల్లి మండలంలోని గోపాలపురం, మాచినపల్లి, కన్నెకల్, కేశవాపురం గ్రామాల్లోని మూడు వేల ఎకరాలకు నీరందించాల్సి ఉండగా, నీరు అందకపోవడంతో బోరుబావుల ఆధారంగా రైతులు సుమారు 1,000 ఎకరాల్లో వేసుకున్న వరి పొలాలు, బత్తాయి తోటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాల్వల పర్యవేక్షణ చేసి అక్రమంగా ఏర్పాటుచేసిన తూములను తొలగించి చివరి భూములకు నీరందించాలని రైతులు బోడ యాదయ్య, జూలకంటి శ్రీనివాస్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, నర్సిరెడ్డి, లక్ష్మణ్, శంకర్, వెంకటయ్య, యాదయ్య, అంజయ్య, కొమురయ్య, వెంకన్న, కొండలుతో పాటు పలువురు కోరుతున్నారు. సుమారు గంటకు పైగా నిరసన వ్యక్తం చేసి చివరి భూములకు నీరందించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు.

ట్రాక్టర్ ట్రాలీల దొంగల రిమాండ్



ట్రాక్టర్ ట్రాలీలను చోరీ చేస్తున్న నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ రాజు

డిండి, సెప్టెంబరు 21 : పొలాల వద్ద ఉంచిన ట్రాక్టర్ ట్రాలీలను అపహరించిన వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నల్లగొండ జిల్లా డిండి ఎస్ఐ రాజు శనివారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. డిండి మండలం కామేపల్లి గ్రామానికి చెందిన మాధవరం సంపత్‌రావు, నాగర్‌కర్నూల్ జిల్లా బలుమూరు మండలం గట్టుతుమ్మెన గ్రామానికి చెందిన బొలగం శ్రీను, అదే జిల్లా అచ్చంపేట పట్టణానికి చెందిన కడారి బాబు ముగ్గురు స్నేహితులు. వీరు ట్రాక్టర్ ట్రాలీల దొంగతనాలకు పాల్పడుతుంటారు. కామేపల్లి గ్రామానికి చెందిన ఎదుర్ల సందీప్ తన ట్రాక్టర్ ట్రాలీని పొలం వద్ద ఉంచాడు. అదే గ్రామానికి చెందిన సంపత్‌రావు సూచన మేరకు అతడి స్నేహితులు బొలగం శ్రీను తన సొంత ట్రాక్టర్ ఇంజన్‌తో బాబుతో కలిసి ఈ నెల 4న పొలం వద్ద ఉంచిన ఎదుర్ల సందీప్ ట్రాక్టర్ ట్రాలీని అపహరించి అచ్చంపేటకు తరలించి ఒక చోట ఉంచారు. ఈ నెల 21న అపహరించిన ట్రాక్టర్ ట్రాలీని దేవరకొండలో విక్రయించేందుకు బొలగం శ్రీను, కడారి బాబు తరలిస్తుండగా డిండి శివారులో పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండలం పర్వతగిరికి చెందిన మరో రైతు ట్రాక్టర్ ట్రాలీని కూడా ఈ ఏడాది జూలై 12న కడారి బాబు అపహరించి ట్రాలీని విక్రయించి పెట్టాలని సంపత్‌రావుకు అప్పగించాడు. విచారణ జరిపిన పోలీసులు రెండు ట్రాక్టర్ ట్రాలీలను తరలిస్తున్న ఇంజన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురుని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ రాజు తెలిపారు.

ఇద్దరి అరెస్ట్, రిమాండ్

కనగల్, సెప్టెంబర్ 21: ఇసుక రవాణా కేసులో కోర్టుకు హాజరు కాని ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నల్లగొండ జిల్లా కనగల్ ఎస్ఐ విష్ణుమూర్తి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కనగల్ గ్రామానికి చెందిన నీలకంఠం ధనుంజయ్య, నక్క జగన్‌లపై జిల్లా స్పెషల్ మొబైల్ కోర్టు నాన్‌బెయిలబుల్ వారెంట్‌ను జారీ చేసింది. ఈ నేపథ్యంలో శనివారం సదరు వ్యక్తులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ తెలిపారు. అనంతరం వీరిని కోర్టు ఆదేశాల మేరకు జైలుకు తరలించినట్లు వివరించారు.

నిలకడగా సాగర్ నీటి మట్టం

నాగార్జునసాగర్, కేతేపలి, మేళ్లచెర్వు, సెప్టెంబరు 21: నాగార్జున సాగర్ ప్రాజెక్టు నీటిమట్టం 589.80అడుగుల వద్ద నిలకడగా ఉంది. సాగర్‌కు ఎగువన ఉన్న శ్రీశైలం నుంచి 7,699క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590అడుగులు(312.0450 టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 589.80అడుగులు(311.4474టీఎంసీలు)గా ఉంది. సాగర్ నుంచి కుడి కాల్వ ద్వారా 10,120 క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 4,287 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,136 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800 క్యూసెక్కులు, వరద కాల్వ ద్వారా 600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 44,943 నీరు విడుదలవుతుండగా, ఎగువ నుంచి 7,699 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది.

మూసీకి పెరిగిన ఇన్‌ఫ్లో...

సాగర్ తర్వాత రెండో సాగునీటి ప్రాజెక్టుగా ఉన్న మూసీ రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో పెరిగింది. 10రోజులకు పైగా వర్షాలు లేకపోవడంతో ఇన్‌ఫ్లో పూర్తిగా తగ్గింది. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి, శనివారం వర్షాలు కురవడంతో వరద దిగువకు వచ్చి ప్రాజెక్టులో చేరుతోంది. శనివారం సాయంత్రానికి 1,825 క్యూసెక్కులుగా నమోదైంది. 645(4.46టీఎంసీలు) అడుగుల పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం ఉన్న మూసీ ప్రాజెక్టు నీటిమట్టం 643.90(4.17టీఎంసీ)అడుగులుగా ఉంది. మరోవైపు కుడి,ఎడమకాల్వలకు సాగునీటి విడుదల కొనసాగుతోంది. కుడికాల్వకు 120.82 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 314.14క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నారు.


ఒక గేటు ద్వారా పులిచింతల నుంచి నీటి విడుదల

ఉభయ తెలుగు రాష్ట్రాల సరిహద్దులో ఉన్న పులిచింతల ప్రాజెక్టుకు వచ్చిన వరదను వచ్చినట్లు దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 175(45.77టీఎంసీలు)అడుగులు కాగా, శనివారం సాయంత్రానికి 174.89(45.61 టీఎంసీలు)అడుగులుగా నమోదైంది. ప్రాజెక్టు ఒక గేటు నుంచి 17,640క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం నుంచి 16వేల క్యూసెక్కులను వినియోగిస్తూ నాలుగు యూనిట్ల ద్వారా 104మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. మొత్తంగా అవుట్‌ఫ్లో 33,640 క్యూసెక్కులు, ఇన్‌ఫ్లో 29,845 క్యూసెక్కులుగా నమోదైంది.

నేడు హైదరాబాద్ టు బుద్ధవనానికి బైక్ ర్యాలీ

● 200 బైక్‌లతో 'నిర్వాణ' రైడ్

● ప్రారంభించనున్న మంత్రి జూపల్లి కృష్ణారావు



'నిర్వాణ' ర్యాలీకి సంబంధించిన పోస్టర్

నాగార్జునసాగర్, సెప్టెంబరు 21: అంతర్జాతీయ బౌద్ధక్షేత్రమైన నాగార్జునసాగర్ హిల్‌కాలనీ బుద్ధవనంలో 274 ఎకరాల్లో నిర్మించిన బుద్ధవనానికి ఆదివారం హైదరాబాద్ నుంచి బైక్ రైడర్స్‌తో కలిసి 200 బైక్‌లతో 'నిర్వాణ రైడ్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర పర్యాటకశాఖ ఎండీ, బుద్ధవనం ప్రత్యేక అధికారి ఎస్.ప్రకాష్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7గంటలకు హైదరాబాద్‌లో ది ప్లాజా హోటల్ వద్ద ఈ రైడ్‌ను పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు జెండా ఊపి ప్రారంభిస్తారని ఆయన తెలిపారు. ఈ రైడ్ మధ్యాహ్నం 12గంటలకు సాగర్ బుద్ధవనానికి చేరుకుంటుందని తెలిపారు. మధ్యాహ్న భోజన అనంతరం బుద్ధవనాన్ని సందర్శించి తిరిగి హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, ముఖ్య కార్యదర్శి వాణి ప్రసాద్ పాల్గొంటారని తెలిపారు.

● బండి.. జగమొండి

క్లిక్ క్లిక్



నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి సూర్యాపేటకు వెళ్లే నల్లగొండ డిపోకు చెందిన ఆర్డీనరీ బస్సు ఎంతకూ స్టార్ట్ కాకపోవడంతో ప్రయాణికుల సహాయంతో డ్రైవర్ బస్సును స్టార్ట్ చేశారు.

జిల్లాలో మోస్తరు వర్షం

● పిడుగుపాటుతో వ్యక్తికి గాయాలు ● షార్ట్‌సర్క్యూట్‌తో పలు ఇళ్లలో కాలిపోయిన గృహోపకరణాలు



సూర్యాపేటలో జిల్లాకేంద్రంలో కురుస్తున్న వర్షం

సూర్యాపేటటౌన్, సెప్టెంబరు 21: జిల్లాలో శనివారం వర్షం కురిసింది. సాయంత్రం సుమారు అరగంటకు పైగా ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. అత్యధికంగా నాగారం మండలంలో 42.1మిల్లీమీటర్ల వర్షం కురిసింది. అత్యల్పంగా మోతె మండలంలో 0.5 మిల్లీమీటర్ల వర్షం నమోదైంది. తిరులమగిరిలో 37.9, గరిడేపల్లిలో 28.8, నేరేడుచర్లలో 27.9, జాజిరెడ్డిగూడెంలో 25.5, సూర్యాపేటలో 25.2, పెన్‌పహాడ్‌లో 19.9, నడిగూడెంలో 14.7, పాలకవీడులో 13.1, హుజూర్‌నగర్‌లో 9.9, తుంగతుర్తిలో 8.3, చివ్వెంలలో 8.1, మునగాలలో 7.1, మట్టంపల్లిలో 4.5, మేళ్ళచెర్వులో 2.8, చింతలపాలెం మండలంలో 2.1 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జిల్లాలో 12.9 మిల్లీమీటర్ల సరాసరి వర్షపాతం నమోదైంది.

వర్షం.. ఉరుములు..

సూర్యాపేట పట్టణంలో జిల్లాకేంద్రంలోని తాళ్లగడ్డలో లూనావత్ విజయ్‌సింగ్ ఇంటిపై పిడుగు పడింది. ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదు. పడిడుగుపాటుకు పలు ఇళ్లలోని 11ఫ్యాన్లు, మూడు టీవీలు, కాలిపోయాయి. జిల్లా కేంద్రంలోని చింతలచెర్వు కాలనీకి చెందిన మెరుగు అనిత్ తన ఇంటి సమీపంలో తన పొలంలో వ్యవసాయ పనులు చేసుకుంటుండగా అతడికి సమీపంలోనే పిడుగు పడింది. దీంతో అనిత్ శరీరం కొంత మేర కాలిపోయింది. చెవుల నుంచి రక్తస్రావం రావడంతో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం చికిత్స అందిస్తున్నారు.

పెన్‌పహాడ్: మండలంలో శనివారం భారీ వర్షం కురిసింది. నీటితో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. రోడ్లపై నీరు చేరింది. అన్నారంబ్రిడ్జి గ్రామపంచాయతీ కార్యాలయ ప్రాంగణంలోకి నీరు చేరుకుంది. అన్నారంబ్రిడ్జి గ్రామంలో లిఫ్టు గోదాందగ్గర రెండు సంవత్సరాల నుంచి ఎరుకల, గంగిరేద్దులు, చెంచుల కులస్తులు బతుకు దెరువు కోసం ఇక్కడి 15కుటుంబాల సభ్యులు వలసలు వచ్చి డేరా గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తున్నారు. కురిసిన వర్షం నీరు డేరా గుడిసెలల్లోకి చేరడంతో తారు రోడ్డు, చెట్ల కింద నిలబడి ఉన్నారు.

నేరేడుచర్ల: నేరేడుచర్లలో భారీ వర్షం కురిసింది. దీంతో నేరేడుచర్ల పట్టణంలోని జాన్‌పహాడ్ రోడ్డులో కల్వర్టు మీద నుంచి నీరు ప్రవహించింది. శిశుమందిర్ వద్ద రహదారి పై నుంచి వరద నీరు ప్రవహిస్తుంది. శుక్రవారం రాత్రి, శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో పలు చోట్ల రహదారులపై నుంచి నీరు ప్రవహిస్తుంది.

చిలుకూరు: మండలకేంద్రంలో శనివారం పిడుగుపాటుకు రెండు పాడిగేదెలు మృతిచెందాయి. సాయంత్రం వర్షం కురిసే సమయంలో పిడుగు పడడంతో గ్రామానికి చెందిన కొండ యల్లయ్యకు చెందిన రెండు పాడిగేదెలు అక్కడికక్కడే మృతిచెందాయి. మృతిచెందిన పాడిగేదెల విలువ సుమారు రూ.1.50 లక్షలు ఉంటుందని బాధిత రైతు తెలిపారు.



పెన్‌పహాడ్ : అన్నారం గ్రామపంచాయతీ కార్యాలయంలోకి చేరిన వర్షపు నీరు



నేరేడుచర్ల శిశుమందిర్ వద్ద రహదారిపై ప్రవహిస్తున్న వరద నీరు

బీజేపీతో దేశ అభివృద్ధి సాధ్యం



సభ్యత్వాలు నమోదు చేయిస్తున్న బీజేపీ నాయకులు

తుంగతుర్తి, సెప్టెంబరు 21: బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని బీజేవైఎం రాష్ట్ర నాయకుడు సంకినేని వరుణ్‌రావు అన్నారు. మండల కేంద్రంలో శనివారం పార్టీ సభ్యత్వాలు నమోదు చేయించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి గడపకూ తీసుకెళ్లి పార్టీ అభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లెపాక సాయిబాబా, గాజుల మహేందర్, శ్రీనివాస్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

'సమస్యల పరిష్కారానికి పోరాటాలు'

మద్దిరాల, సెప్టెంబరు 21: సమస్యల పరిష్కారానికి పోరాటాలు నిర్వహిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కోట గోపి అన్నారు. మండలంలోని పోలుమళ్లలో శనివారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వంపై పేదలపై భారాలు మోపుతూ దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు అగిస్తోందని విమర్శించారు. రుణమాఫీ కాక రాష్ట్రంలో అనేకమంది రైతులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతు భరోసా నిధులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం గ్రామ శాఖ కార్యదర్శిగా ఆకుల రమేష్‌ను ఎన్నుకున్నారు. సమావేశంలో నాయకులు కల్లెపల్లి భాస్కర్, నాయకులు చితిరాల నారాయణ, అచ్చయ్య, వల్లపు వీరస్వామి, వల్లపు మల్లయ్య, రాంబాబు, వెంకన్న, మమూనూరి మల్లయ్య, చంద్రయ్య పాల్గొన్నారు.

పత్తిపంటను పరిశీలించిన శాస్త్రవేత్తలు



పత్తి చేనును పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

తిరుమలగిరి, సెప్టెంబరు 21: మునిసిపాలిటీ పరిధిలోని మాలిపురం గ్రామానికి చెందిన రైతు దూలం సోమయ్య తన పత్తిచేనులో పురుగుల మందులు వాడడంతో మొక్కలు, పిందెలు వాడిపోయాయని వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేశాడు. గడ్డిపల్లి కృషి విజ్ఞానకేంద్రంలో శాస్త్రవేత్తలు రైతు సాగు చేసిన పత్తిచేనును పరిశీలించి మాట్లాడారు. కలుపు మందును చేనుకు పిచికారీ చేయకూడదన్నారు. పంట నష్టం వివరాలను ఏడీఏ తెలిపి రైతుకు న్యాయం జరిగేలా చూస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు బాలు, డాక్టర్ నరేశ్ కిరణ్, ఏవో నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

మద్దిరాల, సెప్టెంబరు 21: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని తహసీల్దార్ అమీన్‌సింగ్, ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి అన్నారు. స్థానిక జడ్పీహైస్కూల్‌లో మండలస్థాయి క్రీడలను ప్రారంభించి మాట్లాడారు. డివిజన్ స్థాయి క్రీడల్లో పాల్గొనేందుకు మండలస్థాయి క్రీడాకారులను ఎంపిక చేయాలన్నారు. అనంతరం కస్తూర్బా పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవో రాములునాయక్, ఎస్‌ఐ వీరన్న పాల్గొన్నారు.

పాఠశాలల బలోపేతానికి సహకరించాలి




సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో శాంతయ్య

తిరుమలగిరి రూరల్, సెప్టెంబరు 21: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సహకరించాలని ఎంఈవో శాంతయ్య కోరారు. మండలంలోని తొండ గ్రామ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో శనివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపాలని, తరుచు గా పాఠశాలకు వచ్చి వారి పిల్లల చదువు వివరాలు అడిగి తెలుసుకోవాలన్నారు కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, రాజు, సైదులు, తల్లిదండ్రులు నాగయ్య, భిక్షం, లక్ష్మయ్య, ప్రవీణ్ పాల్గొన్నారు.

నూతన్‌కల్: దాతలు ముందుకు వచ్చి మెటీరియల్ అందించడం అభినందనీయమని ఎంఈవో రాములునాయక్ అన్నారు. మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అక్షర ఫౌండేషన్ ఆధ్వర్యంలో 8వ తరగతిలో ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికైన విద్యార్థులకు శనివారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ యాస రాంకుమార్‌రెడ్డి, రాములు, కృష్ణారెడ్డి, మల్లయ్య, మోతీలాల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. మిర్యాలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పాఠశాల ఆంగ్లం బోధించే సిద్దిక్ పాషా సొంత ఖర్చులతో నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు.

లింగయ్య ఆశయాలు సాధించాలి

నాగారం, సెప్టెంబరు 21: వేముల పెద లింగయ్య ఆశయాలు సాధించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు అవునూరి మధు అన్నారు. మండలంలోని డి. కొత్తపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి లింగయ్య ప్రథమ వర్ధంతి సభ నిర్వహించి స్థూపాన్ని ఆవిష్కరించారు. 1994లో జరిగిన సారా వ్యతిరేక ఉద్యమంలో లింగయ్య క్రియాశీల పాత్ర పోషించి గ్రామంలో సారా నిర్మూలనకు కృషిచేశారని గుర్తుచేశారు. ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వి. కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నాయే తప్ప దోపిడీ వ్యవస్థ రూపు మాపడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మండారి డేవిడ్‌కుమార్, సంపెట కాశయ్య, పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు ఇందూరు సాగార్, గంట నాగయ్య, బోడ్డు శంకర్, పి. కిరణ్, ఉదయగిరి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ నాయకుడు మధు

ఓటరు జాబితా పారదర్శకంగా రూపొందించాలి



గరిడేపల్లిలో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాసులు

గరిడేపల్లి, సెప్టెంబరు 21: గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన ముసాయిదా ఓటరు జాబితాలో తప్పులు లేకుండా పారదర్శకంగా రూపొందించాలని చేయాలని హుజూర్‌నగర్ ఆర్డీవో వి. శ్రీనివాసులు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో శనివారం జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటరు జాబితా రూపకల్పన ఈ నెల 26వ తేదీ వరకు ఆన్‌లైన్ చేయాలని ఓటరు జాబితా తయారీలో లోపాలు లేకుండా సరిచేయాలని ఈ నెల 29న జాబితాను ప్రచురిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బండ కవిత, ఎంపీడీవో సరోజ, ఎంపీవో మౌలానా, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

నేరేడుచర్ల: ఓటర జాబితాపై అభ్యంతరాలు, ఫిర్యాదులు వస్తే సమగ్ర విచారణ చేపట్టాలని హుజూర్‌నగర్ ఆర్డీవో శ్రీనివాసులు ఆదేశించారు. ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఓటరు జాబితా ఫిర్యాదులపై నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. ఫిర్యాదులపై కార్యదర్శులు క్షేత్రస్థాయిలో పరిశీలించి విచారణ చేపట్టాలన్నారు. ఈ నెల 26 వరకు విచారణ పూర్తిచేసి తుది జాబితా సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ సురగి సైదులు, ఎంపీడీవో సోమ సుందర్‌రెడ్డి, ఎంపీవో హరిసింగ్ పాల్గొన్నారు.

మేళ్లచెర్వు: చింతలపాలెం మండలం దొండపాడు గ్రామ ఓటర్ల జాబితా తప్పుల తడకగా ఉందని బీఆర్‌ఎస్ నాయకులు తహసీల్దార్ సురేందర్‌రెడ్డికి శనివారం వినతిపత్రం అందజేశారు. ఓటర్ల జాబితాలో చనిపోయిన వారి పేర్లు, స్థానికంగా నివాసంలేని వారి పేర్లు నమోదయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు శ్రీనివాసరావు, సత్యం, శేషు, రమేశ్ పాల్గొన్నారు.

డ్రగ్స్, సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి



గరిడేపల్లిలో మాట్లాడుతున్న ఎస్‌ఐ నరేష్

గరిడేపల్లి, సెప్టెంబరు 21: డ్రగ్స్, సైబర్ నేరాలపై అవగాహన ఉండాలని ఎస్‌ఐ. చలిగంటి నరేష్ అన్నారు. మండల పరిధిలోని కీతవారిగూడెం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పోలీసు కళాబృందం ఆధ్వర్యంలో శనివారం అవగాహన కల్పించారు. గంజాయి, డ్రగ్స్, మత్తు మందులు, గుట్కాలు ప్రమాదకరమన్నారు. విద్యార్థులు ఇంటర్‌నెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని, సైబర్ మోసగాళ్ల ఉచ్చులో పడొద్దని సూచించారు. బ్యాంక్ ఖాతా, ఏటీఎం పిన్ నెంబర్లు, ఓటీపీ వివరాలు చెప్పవద్దన్నారు. ఆశచూపిస్తే వాటికి ఆకర్షితులు కావొద్దని సూచించారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే టోల్‌ఫ్రీ నెంబర్ 1930కు కాల్ చేయాలని సూచించారు. వ్యక్తిగత ఫొటోలను డీపీలుగా పెట్టుకోవద్దన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేనివారు డ్రైవింగ్ చేయవద్దని, ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సువర్ణ, ఏఎస్‌ఐ, సురేందర్ కానిస్టేబుల్ నాగేశ్వరరావు, హోంగార్డు శ్రీనివాసరావు, కళాబృందం ఇన్‌చార్జి యల్లయ్య, గోపయ్య, గురులింగం, క్రిష్ణ, చారి నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



నేరేడుచర్ల: ఆశా వర్కర్లను సన్మానిస్తున్న చైర్మన్, వైస్ చైర్మన్



సూర్యాపేటలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ ఉపేంద్ర

నేరేడుచర్ల, సెప్టెంబరు 21: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీవో హరిసింగ్ అన్నారు. పోషణ మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని పులగంబండతండా అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. అనంతరం గ్రామంలో పిచ్చి మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో కార్యదర్శి అరుణశ్రీ, హెచ్ఎం శ్రీధర్, ఏఎన్ఎం జానమ్మ, సైదమ్మ పాల్గొన్నారు. ఆశా వర్కర్స్‌డే సందర్భంగా ఆశా వర్కర్లు మంజుల, సీతలను నేరేడుచర్ల మునిసిపల్ చైర్మన్ ప్రకాశ్, వైస్ చైర్‌పర్సన్ అలక సరిత, కమిషనర్ అశోక్‌రెడ్డి సత్కరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి నాగిని, సీహెచ్‌ఓ శ్రీనివాస్, సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తిరుమలగిరి: విద్యార్థులు బాలల చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కందుకూరి మంగ తెలిపారు. బాలల చట్టాలు, బాధ్యతలపై కస్తూర్బా విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ సుస్మిత, పాల్గొన్నారు.

హుజూర్‌నగర్: పట్టణంలోని గోవిందాపురం పీర్లచావిడి సెంటర్ అంగన్‌వాడి కేంద్రాల్లో చిన్నారులకు మండల వైద్యాధికారి డాక్టర్ పుష్పలత ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో నూర్జహన్, ఇందిరాల రామకృష్ణ, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి: చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సీడీపీవో పారిజాతం అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో పోషణ అభియాన్ మహోత్సవం నిర్వహించారు. పౌష్టికాహార లోపంలేని పిల్లలను తయారు చేయడమే లక్ష్యంగా అంగన్వాడీ కార్యకర్తలు పనిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో షేక్ సుష్మా, ఏపీఎం లక్ష్మి, సూపర్‌వైజర్ మంగా, పోషణ అభియాన్ కోఆర్డినేటర్ ఫరీద్ పాల్గొన్నారు. మండలంలోని రామలక్ష్మీపురం అంగన్వాడీ కేంద్రంలో పోషణ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు.

సూర్యాపేటఅర్బన్: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉపేంద్ర అన్నారు. జిల్లాకేంద్రంలోని 28వార్డు సరస్వతీ పాఠశాల ప్రాంతంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య లక్ష్మీపై ఏర్పాటు సమావేశంలో మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు రక్తహీనతకు గురికాకుండా బలమైన ఆహారం తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల ద్వారా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని సరఫరా చేస్తుంద న్నారు. ఐదేళ్ల లోపు చిన్నారులను అంగన్‌వాడీలో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సంధ్యారాణి, అంగన్‌వాడీ ఆయా ఎస్‌కె. అస్మ తదితరులు పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలు సాధించాలి



కొండా లక్ష్మణ్ బాపూజి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

తిరుమలగిరి, సెప్టెంబరు 21: కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయ సాధనకు కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. బీసీ సంఘం, పద్మశాలి సంఘం, పూలే అధ్యయన వేదిక ఆధ్వర్యంలో చేనేత సహకార సంఘం కార్యాలయంలో కొండా లక్ష్మణ్ వర్ధంతి శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు క్తొతగట్టు మల్లయ్య, తన్నీరు రాంప్రభు, వంగరి బ్రహ్మం, వంగరి సోమక్రిష్ణ, గుండు కిరణ్, మల్లయ్య, అంబదాస్, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

కల్తీ నెయ్యి వాడిన వారిపై చర్యలు తీసుకోవాలి

నూతన్‌కల్, సెప్టెంబరు 21: తిరుపతి వేంకటేశ్వరస్వామి పవిత్రమైన లడ్డూ తయారీలో కల్తీనెయ్యి వాడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ తుంగతుర్తి నియోజకవర్గ కన్వీనర్‌కాపా రవికుమార్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. ఏపీలో ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో తిరుపతి దేవాస్థానంలో హిందూ సాంప్రదాయాలను భ్రష్టు పట్టించారన్నారు. పూర్తిస్థాయి విచారణ జరిపించి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మద్ది సంజీవరెడ్డి, జక్కుల ఉప్పలయ్య, బొల్కు కొమరయ్య, భవాణిశంకర్, ఉపేందర్, వెంకన్న తదితరులు ఉన్నారు.

మెప్మా ఆర్పీలపై ఆరోపణలు సరికాదు




మునిసిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మెప్మా ఆర్పీలు

సూర్యాపేటఅర్బన్, సెప్టెంబరు 21: కొంత మంది మెప్మా ఆర్పీలపై అసత్య ఆరోపణలు చేయడం సరికాదని మెప్మా ఆర్పీ జిల్లా అధ్యక్షురాలు అన్నెపర్తి రాణి అన్నారు. జిల్లాకేంద్రంలోని మునిసిపల్ కార్యాలయం ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. తీసుకున్న పొదుపు సంఘం డబ్బుల నిమిత్తం రికవరీకి వెళ్లే మెప్మా సిబ్బందికి లెక్కలు చూపకుండా టౌన్‌లెవల్ ఫెడరేషన్ సభ్యురాలు నిందలు వేయడం దారుణమన్నారు. మెప్మా వ్యవస్థను రద్దు చేయాలని స్వార్థంతో జిల్లా అధికారులకు వినతిపత్రాలు అందజేస్తుందని ఆరోపించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకుపోవడంలో మెప్మాఆర్పీ సిబ్బంది కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్పీలు కోతి పద్మ, కోల మంగ, బీబీ, మంత్రాల పద్మ, గోన విజయమ్మ, కప్పల పద్మ, నూర్జహాన్, రెహానా, లక్ష్మీప్రియ, రజినీ, నాగమణి, రాణి, రాజేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

పంటపొలాలకు నీరందించాలి

అనంతగిరి, సెప్టెంబరు 21: రైతుల పంట పొలాలకు నీరందించాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముస్కు శ్రీనివాస్‌రెడ్డి కోరారు. నడిగూడెం మండలంలోని సిరిపురం వద్ద ఉన్న 14-ఎ, 14-బీ సాగర్ కాల్వకు నీటిని విడుదల చేయడం గురించి ఎన్నెస్పీ అధికారులతో మాట్లాడి అడ్డుకట్ట వేసే ప్రదేశాన్ని శనివారం పరిశీలించారు. వీలైనంత త్వరగా రైతు పంట పొలాలకు నీరు అందించాలని కోరారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు కొండపల్లి వాసు, మాజీ ఎంపీపీ చుండూరి వెంకటేశ్వర్లు, నాయకులు బుర్ర పుల్లారెడ్డి, జొన్నలగడ్డ కోటేశ్వరరావు, బాబునాయక్, గుర్రం వెంకటరెడ్డి, అమీనాబాద్ మాజీ సర్పంచ్ ముత్తినేని కోటేశ్వరరావు, అనంతగిరి పీఏసీఎస్ డైరెక్టర్ బోడెపూడి సత్యనారాయణ ఉన్నారు.



పనులు పరిశీలిస్తున్న నాయకులు

సంక్షిప్త సమాచారం..

నూతన్‌కల్: మండల పరిధిలోని మిర్యాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మెంచు సోమనర్సయ్య అకాల మృతి పార్టీకి తీరనిలోటని ఆ పార్టీ జిల్లా నాయకుడు మెంచు చక్రయ్య, దరిపెల్లి వీరన్న అన్నారు. గుండెపోటుతో మృతిచెందిన సోమనర్సయ్య అంత్యక్రియల్లో పాల్గొని నివాళులర్పించారు. సంతాపం తెలిపిన వారిలో నాయకులు మన్నెం దశరథ, అనంతుల శ్రీనివాస్, గోరుగంటి రాంచందర్‌రావు, మెంచు లింగమల్లు, గునగంటి వెంకన్న, వేల్పుల రఘు, కిరణ్ ఉన్నారు.

పాలకవీడు: మాతృమరణాలను నివారించాలంటే సమతుల్య ఆహారం తీసుకోవాలని ఏఎన్‌ఎం ఆర్. నాగమణి అన్నారు. మండల పరిధిలోని బొత్తలపాలెం గ్రామంలో అంగన్‌వాడీ టీచర్ల ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బాబు, అంగన్‌వాడీ టీచర్లు జానకమ్మ, ప్రేమలత, ఆశా వర్కర్లు జ్యోతి, నాగజుకన్య, వెంకటేశ్వర్లు, యేసు, ముత్తమ్మ పాల్గొన్నారు.

మద్దిరాల: మండల పరిధిలోని గోరెంట్ల గ్రామ జడ్పీహైస్కూల్‌కు ఆత్మకూర్(ఎస్) మండలం గట్టికల్ గ్రామానికి చెందిన రాచకొండ సైదులు మైక్ సెట్‌ను హెచ్ఎం షరీఫ్‌ఉన్నీసా బేగంకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణవేణి, భిక్షం, శ్రీను, ప్రభాకర్ ఉన్నారు.

తిరుమలగిరి: ప్రతి ఒక్కరూ సీసీకెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ శాగంటి అనసూయ, సీఐ రఘువీర్‌రెడ్డి సూచించారు. సీసీ కెమెరాల ఏర్పాటుపై మండలంలోని వ్యాపారులకు అవగాహన కల్పించారు. సీసీకెమెరాల ఏర్పాటు చేస్తే దొంగతనాలు జరిగినప్పుడు దొంగలను త్వరగా పట్టుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో సురేశ్, సిబ్బంది, వ్యాపారులు పాల్గొన్నారు.

తిరుమలగిరి: తిరుమలగిరిలో బస్‌డిపో కోసం ఈ నెల 25న తిరుమలగిరిలో నిర్వహించే విస్తృతస్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని రూపొందించిన కరపత్రాలను తిరుమలగిరిలో విడుదల చేశారు. కార్యక్రమంలో డిపో సాధన సమితి అధ్యక్షుడు కడెం లింగయ్య, వేల్పుల లింగయ్య, యాకయ్య, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్: యువకులు రక్తదానం చేయాలని జనచైతన్య ట్రస్ట్ సభ్యులు పారాసాయి, శివశంకర్ కోరారు. శనివారం పట్టణానికి చెందిన దగ్గుబాటి రమేశ్, ఇంజమూరి జయంతిలు ఓ పాజిటివ్ రక్తాన్ని రక్తదానం చేశారు. రక్తదానంతో మరొకరి ప్రాణాలను కాపాడవచ్చునన్నారు. కమిటి సభ్యులు సాయి, చంటి తదితరులు పాల్గొన్నారు.

మునగాల రూరల్: సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర వెలకట్టలేనిదని తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీవో రమేష్ దీన్‌దయాల్ అన్నారు. మండలకేంద్రంలోని మోడల్ స్కూల్ నందు బదిలీపై వెళ్లి ప్రిన్సిపాల్ సాయీ ఈశ్వరి, ఉపాధ్యాయులను సన్మానించారు. పాఠశాలకు ఉపాధ్యాయులు అందించిన సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రమేష్ దీన్‌దయాల్ తదితరులు పాల్గొన్నారు.

కోదాడ రూరల్: కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకుడు తమ్మినేని రమేష్ మృతి బాధాకరమని సీపీఐ కార్యదర్శి బత్తినేని హనుమంతరావు, రైతు సంఘం రాష్ట్ర నాయకులు బొల్లు ప్రసాద్, దొడ్డా వెంకటయ్య అన్నారు. మున్సిపల్ పరిధిలోని తమ్మర గ్రామానికి చెందిన తమ్మినేని రమేష్ గుండెపోటుతో మృతిచెందగా, శనివారం ఆయన పార్థివదేహంపై ఎర్రజెండా కప్పి పూలమాలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో పోతురాజు సత్యనారాయణ, కమతం పుల్లయ్య, బత్తినేని శ్రీనివాసరావు, గొట్టిముక్కల కోటినారాయణ, కొండా కోటేశ్వరరావు, నిడిగొండ రామకృష్ణ కమతం మురళి, పసుపులేటి గోవిందరావు, గోసు దిబ్బయ్య పాల్గొన్నారు.

తిరుమలగిరి: తిరుమలగిరి మునిసిపల్ పరిధిలోని అనంతారం మోడల్ స్కూల్ నూతన ప్రిన్సిపాల్‌గా సంజీవ్‌కుమార్ నియమితులయ్యారు. శనివారం మోడల్ స్కూల్ అడిషనల్ డైరెక్టర్ నుంచి నియామక ఉత్తర్వులు అందాయని ఆయన తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులకు మెరుగైన విద్యతో ఆటాపాటల్లో రాణించేలా కృషిచేస్తానని తెలిపారు.

తిరుమలగిరి: బాలల చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కందుకూరి మంగ అన్నారు. తిరుమలగిరి మునిసిపల్ కేంద్రంలోని కస్తూరిబా పాఠశాల విద్యార్థులకు బాలల చట్టాలు, బాధ్యతలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ సుస్మిత, టీచర్లు కవిత, వాణిశ్రీ, కళావతి, ఇందిర, యశోద తదితరులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ రూరల్: పారిశుధ్య నిర్మూలనకు కృషిచేయాలని మున్సిపల్ కమిషనర్ యాకోబ్‌పాషా కోరారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛత-హీ కార్యక్రమంపై అవగాహన కల్పించి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జయవాణిదేవి, తాతరాజు శ్రీనివాసరావు, ఉదయగిరి శ్రీనివాసు, రామకృష్ణ, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి: మహిళల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తుందని మునిసిపల్ చైర్‌పర్సన్ శాగంటి అనసూయరాములు తెలిపారు. శనివారం తిరుమలగిరి మునిసిపాలిటి అనంతారంలో మహాలక్ష్మి పథకం అనుమతిప్రతాలను మహిళలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంధ్య, మాణిక్యమ్మ, సుకన్య, రేణుక తదితరులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్: సంకటహర చతుర్థి పురస్కరించుకొని పట్టణంలోని విఘ్నేశ్వరాలయంలో శనివారం పూజలు నిర్వహించారు. పంచామృతాలతో అభిషేకాలు చేశారు. కార్యక్రమం లో సైదారత్నం, ఓరుగంటి నాగేశ్వరరావు, సత్యనారాయణ, సుధాకర్, నర్సింహరావు, ఏలూరు రాంబాబు, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

